క్లుప్తంగా

భారీ వర్షం

బోథ్: మండల వ్యాప్తంగా శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని 9వ వార్డులో ఓ ఇంటిపై పిడుగు పడింది. పలు కాలనీల్లో ఇళ్లల్లో ఫ్యాన్‌లు, టివిలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఏకధాటిగా ఉరుములు ఉరవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. గత 15 రోజులుగా వర్షం లేక ఎండి పోయేదశకు వచ్చిన పత్తి పంటకు వర్షం ప్రాణం పోసింది. దీంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లోని ఆయన నివాసంలో సభ నిర్వహణ కమిటీ సభ్యులు జోగు రామన్నతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించే సంస్మరణ సభలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారికి చేయూత

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని టెంబ్రి గ్రామానికి చెందిన దేశ్ ముఖ్ మారుబాయి అనారోగ్యంతో మృతి చెందడంతో 15 రోజుల పాప నిరాశ్రయులైంది. ఈ విషయాన్ని నాలుగు రోజుల క్రితం అభిమన్యు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ మెస్రం శేఖర్‌బాబు, పెందూర్ దీపక్‌ల దృష్టికి వచ్చింది. దీంతో సాయం చేయాలని వాట్సాప్‌లో పోస్టు చేశారు. అభిమన్యు వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన రూ. 28 వేలను శనివారం బాధిత పాప కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు మాడవి జంగు, సీడం నంద కిశోకర్, ఆత్రం శీను, పెందూర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఎదులాపురం: నవంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహాసభల్లో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, మంజుల, లింగన్న, ఆశన్న పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం ఎమ్మెల్సీ మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం ఎన్నికల నిర్వహించడం జరిగిందని హెచ్‌ఎం వెంకట్‌రావు తెలిపారు. విద్యార్థులకు అన్నిరకాల ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా విద్యార్థుల్లో ఎన్నికలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు ఎంపీడీవో చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, మురళీధర్, రాకేశ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'గిరి పోషణ్ మిత్ర' ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరి పోషణ్ మిత్ర కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరి పోషణ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రక్తహీనతతో బాధపడుతున్న బాలికలను గుర్తించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రక్త హీనతతో బాధపడుతున్న వారిని గుర్తించిన అనంతరం తదుపరి వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. మండల వైద్యాధికారి సర్ఫారాజ్, సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్, ల్యాబ్ టెక్నిషన్ సమి, పల్లవి, సుష్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు అక్షరాలు చదివేలా, రాసేలా నాణ్యమైన విద్యాబోధన చేయాలని మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ అన్నారు. శనివారం మండలంలోని మామిడిగూడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పోతగూడ, ఖండాల (బి), ధర్‌లోద్దీ, పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలలను సందర్శించిన ఆమె విద్యార్థులకు సాధారణ పదాలు, సంఖ్యలు, చిన్న సంఖ్యల పట్టిక, పుస్తక పఠనం వచ్చేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సాధించిన మార్కుల రికార్డులలో పొందుపర్చాలన్నారు. విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ మధుసూదన్, పీజీ హెచ్‌ఎం సూర్యకాంత్, తదితరులు ఉన్నారు.





డ్రోన్.. అదిరెన్

- వెడ్డింగ్ మాట్లలో పెద్దపీట
- పలువురికి ఉపాధినిస్తున్న రెక్కల రోబో
- పెరుగుతున్న డ్రోన్ వినియోగం

ఆదిలాబాద్: ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యత నిస్తూ శుభకార్యాలు మర్చిపోలేని జ్ఞాపకంగా పదిలపరుచుకోవాలని ఎన్నో నూతన ఉపకరణాలను ఫొటోగ్రాఫర్లు వినియోగిస్తున్నారు. సృజనాత్మక పద్ధతులను వినియోగిస్తూ మరింత ఆకర్షణీయంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారికి సరికొత్త టెక్నాలజీలు తోడ్పాటుగా నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో డ్రోన్ (అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్) ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వినియోగం ఎంతగానో పెరిగింది. కస్టమర్లకు సినిమాటిక్ అనుభూతిని అందిస్తూ, వారి శుభకార్యాల్లో డ్రోన్ సందడి చేస్తోంది. నిఘా వ్యవస్థలోనూ, రాజకీయ నాయకుల సమావేశాల్లో వీటి వినియోగం పెరిగింది.

నయా ట్రెండ్..

తమ మధుర క్షణాలను కెమెరాల్లో బంధించుకుని, ఫొటోలు, వీడియోల రూపంలో చూసుకొని సంబుపడిపోతారు. దీంతో ఫొటోగ్రఫీలో వినూత్నమైన ఆలోచనలతో ఫొటోగ్రాఫర్లు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగానే డ్రోన్ ఫొటోగ్రఫీ ఎంతో పాపులర్ అయింది. పెళ్లి వేడుకల్లో ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్‌లలో డ్రోన్‌ను వినియోగిస్తున్నారు.



డ్రోన్ ఆపరేట్ చేస్తున్న ఆపరేటర్

అద్దెకు అందుబాటు ధరల్లోనే..

డ్రోన్ షాట్స్ కోసం డ్రోన్లను అద్దెకు ఇస్తుంటారు. అదేవిధంగా డ్రోన్ ఉన్నవారు స్వయంగా వారి విజువల్స్ తీస్తూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఒక్కరోజుకూ రూ. 3 వేల నుంచి రూ.5 వేల వరకు అద్దెకు ఇస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

> **ప్రాధాన్యత పెరిగింది**
>
> ప్రారంభంలో డ్రోన్ ఫొటోగ్రఫీకి సంబంధించి అవగాహన తక్కువగా ఉండేది. కొందరు మాత్రమే వీటిని ఆపరేట్ చేయడంతో పాటు కొన్ని ఈవెంట్లో మాత్రమే వినియోగించేవారు. అయితే ప్రస్తుతం వీటికి ఆదరణ రోజు, రోజుకు పెరుగుతూ వస్తుంది. ప్రతిఒక్కరూ వీటిని సులభంగా వినియోగించే సౌలభ్యంతో డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి.
>
> – అశ్వక్, డ్రోన్ ఆపరేటర్, ఆదిలాబాద్

ప్రారంభంలో వీటిని కొందరు ఫొటోగ్రాఫర్లు మాత్రమే వినియోగించగా.. డ్రోన్ ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం పెరగడంతో ప్రస్తుతం అందరూ డ్రోన్లను విరివిగా ఉపయోగిస్తున్నారు.

పటిష్ట బందోబస్తుకూ..

రాజకీయ ర్యాలీలు, సమావేశాల్లో, సభల్లో వీటి వినియోగం పెరిగింది. అదే విధంగా పలు సందర్భాల్లో పోలీస్ యంత్రాంగం సైతం నిఘా వ్యవస్థ పటిష్టానికి, బందోబస్తు కోసం ఈ రెక్కల రోబోను వినియోగిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల పర్యవేక్షణకు, వ్యవసాయ క్షేత్రాల్లో మందుల పిచికారీ, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సాయం చేసేందుకు తోడ్పాటు అందిస్తున్నాయి.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ కోసం త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన దిశగా ప్రభుత్వాలు పని చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమీపంలో ఆయన విగ్రహానికి పద్మశాలి, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమీపంలోని బాపూజీ చౌక్ వద్ద స్మృతి వనం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పద్మశాలి సంఘం నేతలకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్, జక్కుల సత్యనారాయణ, బొమ్మకంటి రమేష్, కామన్ విఠల్, శంకరయ్య, చిలుక విలాస్, పద్మవార్ రాకేశ్ పాల్గొన్నారు.

- కొండా లక్ష్మణ్ బాపూజీ మలిదశ ఉద్యమాల్లో మంత్రి పదవిని లెక్క చేయకుండా ఉద్యమించారని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ అన్నారు. శనివారం కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పెంట భోజన్న, కామణి ప్రభాకర్, కొక్కుల సత్యనారాయణ, పోతన్న, సాగర్, శేఖర్, గంగాధర్, భూమేష్, లస్మయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బోథ్: మండల కేంద్రంతో పాటు ధన్నూర్(బి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మెరుగు భోజన్న, మాసం అనిల్ కుమార్, గంగుల మల్లేష్, సురేందర్, కిష్టయ్య, పోశెట్టి, సంతోష్, స్వామి, రాజన్న పాల్గొన్నారు.

'ఎంపీ, ఎమ్మెల్యేపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం'

ఆదిలాబాద్‌టౌన్: ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ లేకుండా అధికారిక కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు. వారి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి రూ. 322 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, హడావిడిగా కొబ్బరికాయలు కొట్టి అభివృద్ధి పనులను చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచిన పాయల్ శంకర్‌కు అనుభవం లేకపోయినా, ఎంపీ నగేశ్ అనుభవం ఉన్నా ప్రొటోకాల్ ఉల్లంఘించడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు దమ్మపాల్, ప్రకాశ్, మోబిన్, సృజన్, హైమద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలాల అజయ్

సభ్యత్వ నమోదు చేపట్టాలి

తాంసి: ప్రతీబూత్ నుంచి సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో కార్యకర్తలు, నాయకులు భాగస్వాములు కావాలన్నారు. పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు వెంకటేశ్, సంజీవ్, సన్ని కుమార్, కమల్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) నినాదం మాత్రమే కాదు బీజేపీ లక్ష్యమని, ఈ లక్ష్యం దిశగా సమర్థుడి నాయకత్వంలో దేశం సరైన పదంలో వేగంగా ముందుకు సాగుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం వికసిత్ భారత్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కుల మతాలు ప్రాంతాలకు అతీతంగా యావత్ దేశ ప్రజల నుంచి 'అభివృద్ధి చెందిన భారత్'కు విశేష మద్దతు లభిస్తోందన్నారు. ఈ మహా యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, సాయిరాం, గణేశ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న బ్రహ్మానంద్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తాంసి: ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా బోధన చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పరిశీలించి పలు విషయాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. సిలబస్ త్వరగా పూర్తిచేసే విధంగా బోధన చేపట్టాలని, ఇప్పటి నుంచే పరీక్షలు సన్నద్ధమయ్యేలా ప్రణాళికతో విద్యార్థులు చదువుకునే విధంగా చూడాలని ఆదేశించారు. వారి వెంట కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్, అధ్యాపకులు తిరుపతి రెడ్డి, రమణ, దేవేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మౌనిష్ రెడ్డి

తలమడుగు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మందగూడ గ్రామానికి చెందిన మెస్రం మహేందర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసానిస్తూ.. ఆర్థిక సాయం చేశారు.

ఎస్‌బీఐ జీరో ఖాతాలు

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలో శనివారం ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి బ్యాంక్ అకౌంట్‌లేని పలువురికి బ్యాంకు జీరో ఖాతాలు తెరిచి వాటి ప్రతులు అ ందజేశారు. బ్యాంక్ మేనేజర్ బొంత అశోక్, సిబ్బంది ప్రమోద్, సాగర్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని అంబేద్కర్ గణేశ్ మండలి నిర్వాహకులు శనివారం బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గణేశ్ మండప నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సైలు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల బదిలీపై వచ్చిన ఖానాపూర్ ఎస్సై రాహుల్, దస్తురాబాద్ ఎస్సై శంకర్, పెంబి ఎస్సై సాయికుమార్‌లు శనివారం ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును ఉట్నూర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియమ నిబంధనలతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో ఉంటూ.. సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక

సిరికొండ: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన బత్తిని విఠల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గత జూన్‌లో టీజీపీఎస్‌సీ పరీక్షలు నిర్వహించగా.. శుక్రవారం రాత్రి ఫలితా లు వెలువడ్డాయి. హైదారాబాద్‌లోని క్యాంపస్‌లో ఉంటూ.. పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఉద్యోగాని కి ఎంపికైన విఠల్‌ను గ్రామస్తులు, సహచరులు అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఇంద్రవెల్లి: ఆలయాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఈశ్వర్ నగర్‌లో ఆలయాభివృద్ధికి మంజూరైన రూ. 10 లక్షల నిధులతో భూమిపూజ పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలయాలాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిశలు పాటు పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ అలయ మహరాజ్ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, జహిర్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రారంభానికి సిద్ధమైన కేజీబీవీ భవనం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధమైంది. రూ.3.5 కోట్ల నిధులతో గత మూడేళ్ల క్రితం మండల కేంద్రంలో ప్రారంభమైన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. ఎట్టకేలకు నూతన భవనాన్ని గుత్తేదారు పూర్తి చేయడంతో రంగులు వేశారు. ఇన్నిరోజుల పాటు జిల్లా కేంద్రంలోని అద్దె భవనంలో అవస్థలు పడుతున్న భీంపూర్ విద్యార్థినులకు త్వరలో తిప్పలు తప్పనున్నాయి.



భీంపూర్‌లోని కేజీబీవీ భవనం

జమిలి వద్దు.. దామాషా ముద్దు



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: జమిలి ఎన్నికల వద్దు.. దామాషా పద్ధతి ఎన్నికల ముద్దు.. అని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ప్రజాస్వామ్య భారత్‌లో రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ల పైబడిన వారందరికీ ఓటుహక్కు కల్పించబడుతోందన్నారు. దామాషా పద్ధతి ఎన్నికలు జరిగితే విధి విధానాలు ఎన్నికల కమిషన్ రూపొందించి ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు. అంతే కాకుండా అన్ని రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంట్‌లో ప్రజల పక్షాన నిలబడే అవకాశం ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ ఎంపీగా రెండు సార్లు దామాషా పద్ధతి ఎన్నికల విధివిధానాలను పార్లమెంట్లో ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, కుంటాల రాములు, రాందాస్, నర్సింగ్ రావు, భూమన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుషి పంచమి వేడుకలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న మథుర సమాజ్ భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలోని కాలుబాబా ఆలయంలో రుషి పంచమి వేడుకలను ఆలయ మహరాజ్ సురేశ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా జిల్లాల నుంచి మథుర సమాజ్ భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన మథుర సమాజ్ భక్తులు బృందల వారిగా చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



వాయిద్యాలు వాయిస్తున్న మథుర సమాజ్ భక్తులు

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

తలమడుగు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్, సహకార సంఘం సీఈవో మోతే శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సహకార సంఘ ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, రామ్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చిన బంద్ శనివారం విజయవంతం అయింది. ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యయత్నం చేసిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలన్నారు. అలాగే పలు మండల కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వ్యాపార సంస్థలు, విద్యాలయాలు, కళాశాలను స్వచ్ఛందంగా మూసి వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



జైనథ్: నినాదాలు చేస్తున్న నాయకులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899